536) మంగళకౌశిక

ప॥ ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు। చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని॥

చ॥ నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని। నీ నామము వినక నెరవేరె నొకడు।
పూని నిన్ను నుతియించి భోగియాయ నొకడు।మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకడు॥

చ॥ మతిలో నిన్ను దలచి మహిమందె నొకయోగి। తతి నిన్ను దలచకే తగిలె నిన్నొకడు।
అతిభక్తి బనిసేసి అధికుడాయ నొకడు। సతతము బనిగొని సఖుడాయ నొకడు॥

చ॥ కాగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు। ఆగి నిన్ను వెంటదిప్పి ఆవులు మేలందెను।
దాగక శ్రీవేంకటేశ దగ్గరయిన దవ్వయిన। మాగి నిన్ను దలపోసేమనసే గుఱుతు॥